# పవిత్ర పాపి

మద్రాసు రోడ్లు పెద్దవే. కాని అక్కడ జరుగుతున్న అల్లరి ఇంకా పెద్దది కావటాన నేను కారు ఆపక తప్పలేదు. నాకు నాలుగేళ్ళ మద్రాసు ఉద్యోగంలో సొంత కారు వచ్చింది. కానీ తమిళం రాలేదు. ఆ పోట్లాట ఎందుకో అర్థం కాలేదు. కాని ముళ్ళపూడివారు ఎక్కడో వ్రాసినట్టు "బాస బాసే, స్టోను స్టోనే." వాళ్ళు గట్టిగా అరుస్తూ ఒకరి నొకరు తోసుకుంటున్న దృశ్యం మనోహరంగా ఆదుర్తి సుబ్బారావు చిత్రించిన ప్రజాపోరాటంలా ఉందేమో, ఊపిరి బిగపట్టి చూస్తున్నాను; కారులోనే కూర్చుని.

అది ఒక మురికిపేట. మద్రాసులోనూ మురికిపేట లున్నాయి - అందమైన అమ్మాయికి చింపిరి జుట్టులా. కాని అక్కడి జనం తమాషాగా ఉన్నారు. ముఖ్యంగా ఆడవాళ్ళు. వాళ్ళు చేతులు విసురుతూ కీచుగొంతుకల్తో దూకుడుగా ముందుకు వెళ్ళి ఆగిపోతూ ఉండడం, వాళ్ళు నడిచే పద్ధతీ బట్టలు కట్టిన తీరూ వగైరాలు చూస్తుంటే ఏదో ప్రత్యేకత, మామూలు మురికి పేటలలో కనపడని "ఏదో" కనిపిస్తోంది. గీతలందు బాపు గీతలు వేరయా అన్నట్లు అదో ప్రత్యేకత ఈస్లమ్‌కి.

ఆ జనానికి కేంద్రగా ఓ యువకుడున్నాడు. వాళ్ళందరూ అతనిమీదే ముఖ్యంగా విరుచుకుపడుతూ, అప్పుడప్పుడు ఒకరినొకరుతోసుకుంటున్నారు. నేను చూస్తుండగానే అతని లాల్చీ రెండుసార్లు చిరిగింది జనం చేతుల్లో. ఖాళీ విస్కీ సీసా ఒకటి అతని కుడిచేతిలో ఆడుతోంది మ్యూజిక్ డైరెక్టర్ బేటన్‌లా. తిన్నగా నిల్చోలేక ఓసారి లెఫ్టూ ఓసారి రైటూ కాళ్ళమీద బరువు మార్చుకుంటున్న ప్రజా నాయకునిలా ఉన్నాడు. జనం గోలలో అతని మాటలు మునిగిపోతున్నా ఏదో అరుస్తూనే ఉన్నాడు.

అతన్నే నిదానంగా చూస్తున్నాను.

సుందరమూర్తి!

కలగాపులగపు భావాలతో నా మనసు మెలికలు తిరిగిపోయింది.నా స్నేహితుడూ బియీలో క్లాస్‌మేటూ రూం మేటూ అయిన మూర్తిని చదువయ్యాక ఇదే చూడటం.

ఒక్కక్షణం సందేహించాను. 'ఈ దొమ్మీలోకి నేనెందుకు' అని, కాని స్నేహం తీపి

కాబోలు నన్ను కాళ్ళు పట్టుకుని కారులో నుంచి లాగి ఆ జనం మధ్యకి తీసుకెళ్ళింది. "హలో, మూర్తీ!" అని వాణ్ణి కావలించుకున్నాను. వాడు ఎర్రటి కళ్ళతో నన్ను చూసి "రాజా! అర్జెంట్‌గా ఓ రెండువందలియ్యి" అన్నాడు. వెంటనే జేబులోంచి చెక్ బుక్ తీశాను. జనం శాంతించారు.

సుందరమూర్తి సినీమా ఫీల్డులో వుంటున్నాట్ట. ఈ మధ్యనే ఈ ఇళ్ళలో వుండే ఒక సహాయ నటీమణికి కడుపుచేశాడుట. ఎబార్షన్‌కి డబ్బులు అడిగిందట. లేవనేసరికి ఈ గొడవ జరిగిందట. "అబ్బే, చాలా సింపుల్. సమయానికి నువ్వువచ్చావు కాని, లేకపోతే నా బుర్ర బద్దలయ్యేది" అని క్లుప్తంగా వివరించాడు మూర్తి.

"అయితే చెక్కు రాయడం దేనికి? ఆ పిల్ల తాలూకు ఎవర్నేనా మనతో బ్యాంక్‌కి తీసుకెళ్లి డబ్బు ఇచ్చేద్దాం" అన్నాను.

"ఎవరో ఎందుకు? నేనేవస్తా" అని మాకంటె ముందు కారుదగ్గరకు చేరింది ఆ పిల్ల. మీనాక్షి. అంతదాకా ఏడిచిన ఏడుపు ఏమైపోయిందో, కలకలా నవ్వుతోంది. ముఖం నిండా అలుక్కుపోయిన కాటుక మరకల్ని రుమాలుతో తుడుచుకుంటూ 'మీరు సినిమా ప్రొడ్యూసరా'? అని కాబోలు అడిగింది. నేను కార్లు స్టార్టుచేసి నెమ్మదిగా నడుపుతూ "తమిళం తెరిఇల్లె, రొంబనష్టెయ్" అన్నాను. మీనాక్షి పకపకా నవ్వేసి వంటిమీద దెబ్బల్ని లెక్కపెట్టుకుంటున్న మూర్తితో ఏకబిగిన శివాజీగణేశన్ పద్ధతిలో పది నిమిషాలు మాట్లాడింది. నాకు భాష రాక పోయినా ఆమె ధోరణి, మూర్తి ధోరణిని బట్టి అదో ప్రేమసీను అని మాత్రం తెలిసింది.

బేంక్ దగ్గర మీనాక్షికి డబ్బిచ్చి పంపించేసి మూర్తీ నేను మా ఆఫీస్‌కి వెళ్ళాం. నా ఫ్రిజ్‌లోంచి కూల్‌డ్రింక్స్ సీసాలు తీసి ఒకటి మూర్తికిస్తూ "ఏమిట్రా ఈ గొడవ?" అన్నాను.

"కర్మ" అన్నాడు మూర్తి.

నిజంగా ఖర్మే. ఉట్టి 'కర్మ' కాదు 'ఖర్మ'. మూర్తి జీవితం ఇలా అయిందంటే మరే విధంగా అర్థం చేసుకుంటాం?

ఎందుకంటే మూర్తి తల్లీ తండ్రీ చాలా ఆధ్యాత్మిక చింతన కల పుణ్యదంపతులు. మూర్తి పుట్టే సరికే వాళ్ళకి వైరాగ్యం వచ్చేసింది కాబోలు, వెంటనే 'బ్రహ్మ చర్య దీక్ష' మొదలు పెట్టారు. వాళ్ళకి గురువు ఓ 'అమ్మా' ఉండేది. పూజలూ, యాత్రలూ, పవిత్రగ్రంధాల పారాయణా నిత్యం చేస్తూ మూర్తికి ఉగ్గుపాలతోనే ఆ విద్యంతా నేర్పసాగారు. ఒక్కడే బిడ్డ కనుక వెయ్యి కళ్ళతో జాగ్రత్తగా పెంచారు వాణ్ణి.

బియాలో చేరాక హాస్టల్‌లో ఒక రూంలోనే ఉండేవాళ్ళం నేనూ మూర్తీ. ఫస్టియర్ పరీక్షలకి కూర్చోలేదు వాడు. నేను నిలదీసి అడిగితే "టైం లేదు. బిజీగా ఉన్నాను" అన్నాడు. తరవాత నాకు తెలిసింది మూర్తి హాస్టల్ మెస్‌లో అంట్లు తోమే ఓ పిల్లతో సంబంధం పెట్టు కున్నాడని. ఆ తరవాత అది పెద్ద గొడవై మూర్తిని హాస్టల్ నుంచి పంపేశారు. ఖాళీ ఉన్నప్పుడల్లా కాలేజీలో మూర్తితోనే గడిపేవాణ్ణి నేను. వాడి మాటల్లో ఏదో తెలీని అందం ఉండేది. జీవితాన్ని మాలాగాకాకుండా మరోలా ఫీలయేవాడు మూర్తి. ఎప్పుడూ సెక్స్ గురించి

మాట్లాడడు, ఎవరి గురించి చెడుగానూ మాట్లాడడు; వాడి మాటల ద్వారా ఏదో నేర్చుకోవా లనే స్వార్థం కూడా లేకుండా అదేపనిగా వినేవాణ్ణి.

మూర్తి కామజీవితం గురించి నేను ఎప్పుడూ అడగాలేదు వాడు చెప్పా లేదు. బియీ నాలుగేళ్ళూ అయేసరికి తను ప్యాస్ కావాల్సిన పేపర్లు ముప్ఫైమూడు ఉన్నాయని తెలిసి, నీరసంగా నవ్వాడువాడు; ముప్ఫై ముగ్గురు అధర్మపత్నుల్ని ఒక్కసారి సముదాయించినట్లు! "నా తరం కాదు రాజూ, నేను వెళ్ళి పోతున్నాను" అన్నాడు.

"ఎక్కడికి?" కంగారుగా అడిగాను.

"అవతలగట్టుకు, ఇంకా చెప్పాలంటే మైదానంలోకి, హంపీ కన్యల మధ్యకి" అని నవ్వేశాడు.

ఆ రోజు రాత్రి భోంచేసి, నిద్రపోతున్న కాలేజీ మెట్లమీద మేం గడిపిన కొద్ది గంటలూ నాకు మరో ప్రపంచాన్ని చూపించాయి.

"రాజూ, అదేం సామెతరా? నరకానికి వేసిన రోడ్డు-"

"అదా! ది రోడ్ టు హెల్ ఈజ్ పేవ్డ్ విత్ గుడ్ ఇంటెన్షన్స్" (సదభిప్రాయాలనే రాళ్ళతోనే నరకానికి రోడ్డు తయారైంది అని)

'సరిగ్గా అదే.మా అమ్మానాన్నా నన్ను చాలా పవిత్రంగా పెంచారు. నేనిలా అయాను. నాకు వీధికో ప్రేయసీ, రాత్రికో రాక్షసీ అన్నట్లయింది. ఎందుకిలా అయిందిరా? తల్లితండ్రుల ప్రభావం పెంపకాన్ని చూస్తే తెలిసిపోతుందా? మతం మనిషిని మంచివాణ్ణి చేస్తుందా? నేనిలా అవుతాననీ అవాలనీ మా అమ్మా నాన్నా కనీసం నేనూ అనుకోనేలేదే! అంతా సినిమా.... తాగుబోతు డైరెక్టరూ, గుడ్డి కెమేరామేనూ, కుంటి నటీమణులతో మూగ నటులతో తీసిన సినిమా... జీవితం..... రెండర్థాలపాట.... ఎవరికి ఏ అర్థం అందుతుందో...." అని వెక్కి వెక్కి ఏడవ సాగాడు మూర్తి. నేను కూడా ఏడిచాను. తర్వాత కాలేజీ వరండాలో గచ్చుమీద కుక్క లతో బాటు నిద్రపోయాం.

మర్నాడు మూర్తి ఉషారుగా నన్ను ఊరంతా తిప్పి, ఫైవ్‌స్టార్ హోటల్లో విందు చేసి, రైలెక్కుతూ "వెళ్ళొస్తా బ్రదర్. మళ్ళీ కలుస్తానులే" అన్నాడు. ఆరేళ్ళ తర్వాత, మళ్ళీ ఇదే మేం కలవడం.

"అంతా ఖర్మేలే. అది వేరే చెప్పక్కర్లేదు. నువ్వు, ఈ మీనాక్షెవరు?"

"మీనాక్షిని పెళ్ళాడాలి. మా ఆవిడ ఒప్పుకోటం లేదు."

"ఆవిడ ఎక్కడుంది?"

"ఇక్కడే మైలాపూర్‌లో వుంటున్నాం. ముగ్గురు పిల్లలు."

"ఓరి వెధవా! నీ రెండో పెళ్ళికి ఆవిడ ఒప్పుకోవాలా, సిగ్గులేదురా?"

ఇకిలిస్తూ జేబులన్నీ వెతికి "సిగ్గా? లేదురా. ఎవడో జేబుదొంగ సిగ్గులేక బాధపడుతూ నాది కాస్తా కొట్టేసి వుంటాడు" అన్నాడు మూర్తి. నేను వాణ్ణి సంస్కరించే ప్రయత్నం తెలివిగా

విరమించుకున్నాను. సిగ్గు లేనివాడికి నీతులు చెప్పి ఏం లాభం?

"నీతీ అవినీతీ అలా వుంచి, రెండు సంసారాలవుతాయి కదా, డబ్బు చాలుతుందా?" అన్నాను.

"డబ్బు పెద్ద సమస్య కాదులే. మీనాక్షిని నువ్వు చూశావుగా. దానికి చదువూ కల్చరు సున్నా. కాని దాన్ని ముట్టుకుంటే చాలు. నాకు వెయ్యిపులుల బలం వచ్చినట్లుంటుంది. ఇప్పుడు పులులదే రాజ్యం. మంచి చేయాలన్నా కూడా పులులేచెయ్యాలి. మేకలు 'మే, మే' అంటే ఏమీ మారదు-"

"సినిమాల్లో నీ పని ఏమిటి?"

"అదే. ఇందాక నువ్వు రోడ్డుమీద చూసిందే. డైరక్టరు అసిస్టెంటుకి ఆసిస్టెంటుకి అసిస్టెంటు. అంటే... అదెందుకు, రేపో ఎల్లుండో ప్రొడ్యూసర్ డైరెక్టరిని అవుతాగా. ఈలోగా మానాన్న ఆస్తివుంది. దాన్ని రీళ్ళ లెక్కని అమ్ముతున్నాను. బ్లూఫిలింలా గడిచిపోతోంది."

మూర్తి మీనాక్షిని పెళ్ళాడాడు గాని అలవాటుకొద్దీ ఆ 'ప్రేమా' వాడికి చాలలేదు. మొదటి పెళ్ళాం రంగనాయకమ్మతోబాటు, రెండో ఆవిడ మీనాక్షి; 'మూడో ఆవిడలు, మారుతూ ఉంటారు. అదీ వరస.

ఆ తర్వాత అడపా తడపా మూర్తి కలుస్తుండే వాడు. నా కుటుంబానికీ, వాడి కుటుంబాలకీ కూడా పరిచయం ఏర్పడింది. నాలుగేళ్ళలో మూర్తి సినిమా ప్రొడ్యూసర్ కూడా అయ్యాడు.

ఓ రోజు మధ్యాన్నం మూడున్నరకి రంగనాయకమ్మ నాకు ఫోన్ చేసింది. ఎలాగో వీలు చేసుకుని సాయంత్రం తనని ఓసారి కలవమని. ఆమెగొంతులో ఆందోళనని గ్రహించి వెంటనే వస్తున్నానని చెప్పాను. ఎక్కడికి వెళ్ళేదీ నా సెక్రటరీకి చెప్పి మూర్తి మొదటి ఇంటికి వెళ్ళాను.

మూర్తి పెద్దకొడుకు ఉదయ్ "హాయ్ అంకుల్" అన్నాడు గేటు దగ్గరికొచ్చి. "మీ తమ్ముడు ఏడిరా?" అన్నాను. బొమ్మల్తో వరండాలో ఆడుతున్న పాపాయిని ఎత్తుకుంటూ, "వాడికే, జ్వరం! వన్ నాట్ ఫోరుంది, అందుకే అమ్మ ఫోన్చేసింది నీకు" సీరియస్‌గా చెప్పాడు ఉదయ్.

మేం ఇంట్లో కెళ్ళేసరికి రంగనాయకమ్మ వచ్చింది పిల్లల గదిలోంచి. "గిరికి జ్వరమండీ. అస్తమానూ నాన్న నాన్న అని కలవరిస్తున్నాడు. నాకెంతో బెంగగా ఉందండీ. ఆయన ఈ మధ్య ఇటు రావడమే లేదు. వచ్చినా పిల్లలని ఓసారి హలో అనేసి ఊరుకుంటారు. మాకింత డబ్బుపడేస్తే చాలా? కుర్ర మొహాలు తండ్రి లాలన కావాలని తహతహ లాడిపోతున్నారు" అంది. ఇంకా చాలా చెప్పింది తన దుఃఖం గురించి. నేనేం చెప్తాను? "డాక్టరు చూశాడా బాబుని?" అన్నాను.

"ఊఁ. ఫరవాలేదన్నాడు. మందులిస్తున్నాం. కాని బెంగ మందుల్తో పోతుందా? పిల్లలకి మనంత నిబ్బరం ఎలా వుంటుందండి? ఆయన ఒకసారి వస్తే..."

"ట్రై చేస్తానమ్మా. మీరేమీ కంగారు పడకండి. బాబుని నేనోసారి చూస్తాను" అంటూ ఆమె వెంట వెళ్ళాను. శేషగిరి నన్ను చూడగానే కప్పుకున్న దుప్పటీ తోసేసి ఉత్సాహంగా లేచి కూర్చున్నాడు. అవీ ఇవీ మాట్లాడుకున్నాం ఓ అరగంట అయేసరికి వాడికి నిద్ర వచ్చేసింది. నేను వెళ్తుంటే "ఆయనతో చెప్పండి. బాబు చూడాలని కలవరిస్తున్నాడని". అని మరీ మరీ చెప్పింది రంగనాయకమ్మ.

మూర్తి ఆఫీసూ స్టూడియోలూ అన్నీ గాలించి ఒకచోట దొరికిన భోగట్టాతో మూర్తిని కనుక్కున్నాను. అది మూర్తి పదహారో ప్రేయసి సునంద ఇల్లు. నేను మూర్తితో మాట్లాడుతుంటే సునంద ఇబ్బందిగా చూస్తోంది. నేను సూటిగా చెప్పేశాను. "నీ మొదటి పెళ్ళాం రెండో కొడుక్కి జ్వరంగా వుంది మూర్తీ. వెంటనే ఇంటికెళ్ళు." సునంద కాఫీ తెస్తానంటూ వెళ్ళిపోయింది.

అదే అదునని మూర్తిని కసితీరా తిట్టేశాను. కనీసం పిల్లలమీద జాలితోనైనా అప్పుడప్పుడు ఇంటికి తగలడమన్నాను, రంగనాయకమ్మ కూడా ఎంతో ఖంగారుతో ఉందన్నాను. కన్నపిల్లల్ని సరిగా చూసుకునే బాధ్యత తల్లిదేకాదు తండ్రికీ వుందని గర్జించాను.

మూర్తి నావైపు చిత్రంగా చూస్తూ అంతా విన్నాడు. నేను ఆగాక "వెళ్తానే ఉన్నాను రాజూ. నేనే పెళ్ళాన్నీ వదిలేయలేదుగా! ఎటొచ్చీ పనుల తొందరతో తరుచు వెళ్ళడం కుదర్లేదీ మధ్య. ఇందరు పెళ్ళాలూ నన్ను తమ దగ్గరే కట్టి పడేస్తే సినిమాలు కాస్తా తిరప తెళ్ళి క్షవరం చేయించుకొస్తాయి. అప్పుడు ఎవరు చూస్తారు వాళ్ళని? అదీ కాకుండా మీనాక్షికి డెలివరీ టైము. మూడో కానుపు. రంగాకీ మళ్ళీ నెల తప్పింది. నాకు పదికాళ్ళూ పదిచేతులూ లేవుగా..." అని మూర్తి వివరిస్తుంటే,-

"పిల్లలకి తండ్రి డబ్బొక్కటేనా ముఖ్యం? ఆదరణ, పెంపకం అవసరం కాదా?" అని అరిచాను నేను. మూర్తి రెండు నిమిషాలు మాట్లాడలేదు. తల వంచుకుని ఆలోచిస్తూ ఉండిపోయాడు. తరవాత లేచి నిలబడి తాపీగా నా దగ్గరకు వచ్చి నా ముఖానికి జానెడు దూరంలో తన ముఖం పెట్టి "భూ!" అన్నాడు గట్టిగా. సారాకంపు ఛెళ్లున తగిలింది నా ముక్కుకి. ఉక్కిరిబిక్కిరై ముఖాన్ని పక్కకి తిప్పేశాను. మూర్తి బిగ్గరగా నవ్వి రెండు చేతుల్తోనూ నా తలని పట్టుకునే తనవేపు తిప్పుకుని మళ్ళీ "భూ!" అన్నాడు. (భూ అనో భ్రూ అనో నేను ఖచ్చితంగా చెప్పలేను. భో కూడా కావచ్చు). ఈసారి ముఖం పక్కకి తిప్పే వీలు లేదుగా, ఎలాగో భరించి ఏడవలేక నవ్వేశాను.

"నన్నొదులు, బురద వెధవా!" అన్నాను గింజుకుంటూ.

మూర్తి నా భుజం మీద తలపెట్టి ఏడుపు నటిస్తూ "నీకు నా మీద ప్రేమ ఇంతేనా రాజా? నేను 'భూ' అంటే కూడా వినవా? నేను నీ దగ్గరికి రాదగనా? నీకు నేనూ నాకు నీవూ ఏకైక స్నేహితులు కామా? నా సన్నిధి నీ పెన్నిధి కాదా?" అని ఆత్రేయ మార్కు డైలాగ్స్ చదువుతుంటే నాకు పొట్ట చెక్కలయేటంత నవ్వొచ్చింది. నవ్వినవ్వి కన్నీళ్లు వచ్చాయి. సునంద కాఫీ కప్పుల్తో వచ్చి మా వేషాన్ని చూసి బెదురుగా తనూ నవ్వసాగింది.

మూర్తి తన కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ చెమ్మగిలిన తన కళ్ళు తుడుచు కున్నాడు. "అర్థం అయిందా?" అన్నాడు నెమ్మదిగా.

అయిందన్నట్లు తల ఆడించాను. నీకు అర్థం అయింది. ఇదే మా ఆవిడకూ చెప్పాను. అర్థం చేసుకోదు, ఎన్నిసార్లు ఎక్స్‌ప్లెయిన్ చేసినా నేను బాగా తాగివచ్చి తనపిల్లల్ని ముద్దెట్టు కుంటే ఆ సారాకంపుతో వాళ్ళకి దగ్గువచ్చి తాగిన పాలన్నీ కక్కేసుకోవడం కళ్ళారా చూసింది తను. నా సారా వాసనలాగే నా గుణాల వాసనకూడా వాళ్ళకి తగుల్తుంది, వాళ్లని ఎక్కువ చేరదీస్తే. మనిషికి మనసులో ప్రేమ వుంటే చాలదూ? ప్రేమని అతిగా పిల్లలమీద కురిపిస్తే దాంతో పాటు మనపాపాలు కూడా వాళ్ళకి అంటుతాయని నా భయం రాజా! మా అమ్మా, నాన్నా ఆ పనే చేసి వుంటారు నాకు. వాళ్ళు బలవంతపు బ్రహ్మచారులు. ఒక్కడే కొడుకుని కనుక ఇరవై నాలుగ్గంటలూ వాళ్ళ దృష్టి నా మీదే ఉంటంతో చాటుగా వాళ్ళగారాలు బోధలూ, వాళ్ళు అణచు కొన్న కోరికలూ నాకు అంటించేశారు."

"నాకు మా అమ్మానాన్నా నేర్పింది అంటలేదు. కాని రోజంతా వాళ్ళదృష్టి నా మీదే వుంటంతో వాళ్ళు అణచుకొన్న సెక్స్‌ఫీలింగే నాకూ అంటింది. ఒరే, సామెతల్లో ఎంత నిజం వుందిరా! నరుడి కంట నల్లరాయి పగులుతుందిట. తండ్రి అయినంత మాత్రానా నరుడు కాదా ఏ మనిషైనా? నేను నా పిల్లలకి నా గతి పట్టనివ్వను. నా హృదయంలోని పాపపు వాసనలు వాళ్ళ మీద ప్రసరించడం నా కిష్టం లేదు. అందుకే నేనెప్పుడూ వాళ్ళని సూటిగా చూడను. ఓరగా చూస్తాను. అది ప్రేమ నిజంగా వుంటేనే- అని తెలీదు నా మొదటి (పిచ్చి) పెళ్ళానికి. పిల్లల్ని పాడు చేస్తున్నాననుకుంటోంది."

"ఒరే రాజా. నేనిప్పుడు రాసిస్తాను కావలిస్తే పావలా స్టాంపు కూడా పెట్టి. నా పిల్లలకి నేను మహోపకారం చేస్తున్నాను వాళ్ళకి నా గాలి తగలకుండా చేసి, వాళ్ళు వృద్ధిలోకి వస్తారు. బుద్ధీ, అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం - అన్నీ వాళ్ళకి వస్తాయి-"

"ఏమైనా అలా నెగ్లెక్ట్ చేస్తే" అన్నా.

"ఎవర్ని నెగ్లెక్ట్ చేశాను? రంగాకి మూడోనెల కడుపు ఎలా వచ్చిందని?"

"అదే నేమిటి శ్రద్ధ? ఆ పని ఏ గాడిదేనా చేయగలదు"

"నేను గాడిదనే. నా రక్తం పంచుకు పుట్టినందుకు నా పిల్లలకి తగు మాత్రం గాడిద బుద్ధి రావచ్చు. కాని మోతాదు మించదు. కనుక అదీ మంచిదే. కాని నా వాసనలు మాత్రం వాళ్ళకి చచ్చినా అంటించను. వాళ్ళ పూర్వ జన్మల వాసనలు వాళ్ళకి చాలు. పెంపకం ద్వారా నావి అంటించడం పాపం. ఆ పని నా వల్ల కాదు. నేను దెబ్బతిని వున్నాను చాలదూ?" అంటూంటే మూర్తి గొంతు బొంగురు పోయింది.

"నీ సినీమాకి డైలాగ్‌లు నువ్వే రాస్తున్నావా?"

"దడిగా డువానసిరా. తిరగేసి చదువుకో. నేను ఈ పిల్లకి కొంచెం ప్రైవేట్ చెప్పాలి. అది కాగానే ఇంటికి వెళ్తాలే. పాపం రంగడు ఏం బాధపడుతోందో!"

నేను లేచి వచ్చేశాను.

* * *

అంతే జరిగింది. పెద్దయ్యాక ఉదయ్ ఐఏయస్ ఆఫీసరయ్యాడు. శేషగిరి ఇంజనీరై అమెరికాలో వుంటున్నాడు. పాపాయికి చదువుతో బాటు మంచి మొగుడొచ్చాడు. ఆఖర్న పుట్టిన పాప నాలుగేళ్ళు బతికి చచ్చిపోయింది.

మూర్తి చాలా గొప్పవాడని పిల్లలు చెప్పగా అప్పటికి ఒప్పుకుంది రంగనాయకమ్మ.

ఆ తర్వాత తను గడించిన ముప్పై లక్షలనీ, ముప్పై మంది పెళ్ళాలనీ వదిలేసి యోగ సాధనకంటూ రమణాశ్రమంలో చేరిపోయాడు మూర్తి.

(స్వాతి; మాసపత్రిక )

★